క్లుప్తంగా

కరాటే పోటీల విజేతలకు అభినందన



ప్రత్యూషను అభినందిస్తున్న సూర్యకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: కవలగొయ్యి గ్రామంలోని ఎలైట్ కరాటే క్లబ్ నిర్వహించిన కరాటే పోటీల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులకు గురువారం హుకుంపేట సొసైటీ మాజీ ఉపాధ్యక్షులు తెల్లమేకల సూర్యకృష్ణ చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాలు, బెల్టులను అందజేశారు. వారికి శిక్షణ ఇచ్చిన కోచ్ పంచకట్ల శ్రీనివాసులును అభినందించారు. అలాగే భీమవరంలో ఈ నెల ఐదో తేదీన జరిగే రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో పాల్గొనే పంచికట్ల చిన్నాకి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో శివలాల్, గుజరియో అసోసియేషన్ అధ్యక్షుడు రామ్మూర్తి రాజు, కార్యదర్శి హనీ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కడియం: కడియపుసావరం గ్రామంలో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి సర్పంచ్ చెక్కపల్లి మురళీకృష్ణ గురువారం శంకుస్థాపన చేశారు. ఉపాధి హామీ నిధులు రూ.8 లక్షలతో 111 మీటర్ల పొడవున వీటిని నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కట్టా కుటుంబానికి పరామర్శ



కట్టా జమిందార్‌ను పరామర్శిస్తున్న చందన నాగేశ్వర్

కడియం: వేమగిరి గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు కట్టా నగేష్ (జమిందార్), ఆయన కుటుంబ సభ్యులను గురువారం ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ పరామర్శించారు. జమిందార్ తల్లి విజయలక్ష్మి ఇటీవల కన్నుమూశారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి చందన నాగేశ్వర్ పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి మృతి



ఆకెళ్ల వ్యాఘ్రేశ్వరుడు (ఫైల్)

కంబాలచెరువు: ఏపీటీఎఫ్ నాయకుడు, రాజమహేంద్రవరం కార్పొరేషన్ పాఠశాలల్లో దాదాపు 36 ఏళ్లు ఉపాధ్యాయుడిగా పనిచేసిన ఆకెళ్ల వ్యాఘ్రేశ్వరరావు (63) అనారోగ్యంతో గురువారం కన్నుమూశారు. ఆయన మృతికి ఏపీటీఎఫ్ సంతాపం ప్రకటించింది. జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, జిల్లా గౌరవాధ్యక్షుడు వి.అప్పయ్య శాస్త్రి తదితరులు ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు.

డివిజన్ల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక



డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): డివిజన్ల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. స్థానిక 28వ వార్డు భారత్ బొమ్మల సమీపంలో రూ.47 లక్షలతో నిర్మిస్తున్న డ్రైనేజీకి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే డివిజన్ నాయకుడు చిన్న సోమాలమ్మ తల్లి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన 108 కొబ్బరికాయల మొక్కును నాయకులు, కార్యకర్తలతో కలిసి గోరంట్ల తీర్చుకున్నారు. అనంతరం డివిజన్‌లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి శీలం గోవిందు, నగరపాలకసంస్థ డీఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరుతో మోసం

రాజమహేంద్రవరం రూరల్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని తన వద్ద డబ్బులు తీసుకుని, మోసం చేశారని హుకుంపేటకు చెందిన కోసూరి రిషిరేఖ గురువారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమెకు తుని ప్రాంతానికి చెందిన అప్పారావు ద్వారా చెరుకూరి శ్రీనివాసరావు పరిచయం అయ్యాడు. తనకు ఒక కేంద్ర మంత్రి తెలుసునని, ఆయన పలుకుబడిని ఉపయోగించి రూ.60 వేల జీతంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. దీంతో అతడి బ్యాంకు ఖాతాలో ఒకసారి రూ.61 వేలు, మరోసారి రూ.28 వేలు రిషి రేఖ పంపించింది. అనంతరం ఉద్యోగం వేయించక పోగా, తీసుకున్న డబ్బులను చెరుకూరి శ్రీనివాసరావు తిరిగి ఇవ్వలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సర్వీసు రోడ్ల ఊసేది!

- అసంపూర్తిగా మోరంపూడి ఫ్లై ఓవర్ పనులు
- నత్తనడకన విద్యుద్దీపాల ఏర్పాటు
- వాహన చోదకుల ఇక్కట్లు



మోరంపూడి ఫ్లైఓవర్





గోతులమయంగా మారిన సర్వీసు రోడ్లు



రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి ఫ్లైఓవర్‌ను కూటమి నాయకులు ప్రారంభించి సుమారు మూడున్నర నెలలు కావస్తోంది. కానీ ఇప్పటి వరకూ సర్వీసు రోడ్లు వేయలేదు. విద్యుద్దీపాల పనులు కూడా నత్తనడకన జరుగుతున్నాయి. చీకటి పడితే వాహన చోదకులు అంధకారంలో ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. మోరంపూడి ఫ్లైఓవర్ పనులు పూర్తి కాకుండానే కూటమి ప్రభుత్వంలోని మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రారంభోత్సవం చేశారు. ఇది జరిగి దాదాపు వంద రోజులు దాటింది.

అంధకారం

ఫ్లైఓవర్‌పై విద్యుద్దీపాల పనులు నత్తనడకన జరుగుతున్నాయి. దీంతో రాత్రి సమయంలో అంధకారం నెలకొంటోంది. రాకపోకలకు వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులను వేగంగా చేయడానికి కాంట్రాక్టర్ చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. గత ప్రభుత్వంలో అప్పటి ఎంపీ మార్గాని భరత్ రామ్ ప్రతి వారం ఫ్లైఓవర్ పనులను పర్యవేక్షిస్తూ, త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకునేవారు. ఇప్పుడు పర్యవేక్షణ కరువైంది.

అధ్వానంగా సర్వీసు రోడ్లు

ఫ్లైఓవర్‌కు ఇరువైపులా ఉన్న సర్వీసు రోడ్లు అధ్వానంగా మారాయి. గోతులమయంగా మారడంతో పాటు దుమ్ముపైకి లేచిపోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో, వర్షం కురిసినప్పుడు వారి బాధలు వర్ణనాతీతం. అలాగే మోరంపూడి ఫ్లైఓవర్‌పై రెండో లేయరు రోడ్డు పనులు, మార్కింగ్ జరగ లేదు, పూర్తిస్థాయిలో డివైడర్ అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. విద్యుద్దీపాల ఏర్పాటుతో పాటు సర్వీసు రోడ్లు నిర్మాణం చేయాలి.

> **త్వరలో పనులు ప్రారంభం**
>
> మోరంపూడి ఫ్లైఓవర్‌పై విద్యుద్దీపాల ఏర్పాటు జరుగుతోంది. క్లాంప్‌లు, వైరింగ్ పనులు పూర్తయ్యాయి. స్తంభాలు కూడా సిద్ధంగా ఉన్నాయి. సర్వీసు రోడ్లు నిర్మాణం విషయంపై కాంట్రాక్టు సంస్థపై ఒత్తిడి తీసుకువస్తున్నాం. జనవరిలో పనులు చేపట్టడం జరుగుతుంది. త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకుంటాం.
>
> – సురేంద్రనాథ్, ప్రాజెక్టు డైరెక్టర్, ఎన్‌హెచ్‌ఏఐ, రాజమహేంద్రవరం

పుష్కరాలకు ప్రణాళికాబద్ధంగా పనులు

- ఆదాయం పెంచుకునే అంశాలపై దృష్టి
- నగరాభివృద్ధే ప్రధాన లక్ష్యం
- విలేకరులతో కమిషనర్ కేతన్ గార్గ్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని నగర అభివృద్ధే లక్ష్యంగా నగరపాలక సంస్థ పనిచేస్తోందని కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. ఈ మేరకు గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రానున్న పుష్కరాలకు సంబంధించి రెండు పర్యాయాలు ఉన్నత స్థాయి సమావేశాలు ఏర్పాటు చేసి అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. 2027లో జరిగే పుష్కరాలకు ఇప్పటి నుంచే ప్రణాళిక బద్ధంగా పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఘాట్ల విస్తరణ, కొత్త ఘాట్ల ఏర్పాటు, ఘాట్లకు వచ్చే దారిలో రోడ్ల విస్తరణ, డ్రైనేజీలు తదితర అంశాలపై దృష్టి పెడుతున్నట్టు తెలిపారు. రోడ్ల విస్తరణకు సంబంధించి స్థానికుల అంగీకారాన్ని తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుంటామన్నారు. కార్పొరేషన్ ఆదాయం పెంచుకోడానికి తగిన మార్గాలను అన్వేషిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే క్వారీ ఏరియాలో పెట్రోలు బంకు ప్రారంభించామని, అలాగే గ్రీన్ బాండ్లు జారీ చేయాలని కూడా నిర్ణయించామన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే గ్రీన్ బాండ్లు జారీ చేస్తామన్నారు. ఆస్తి పన్ను బకాయిలు, ఖాళీ స్థలాల పన్నుల వసూలుపై దృష్టి పెట్టడంతో రూ.58 కోట్ల రెవెన్యూ వచ్చిందన్నారు. రూ.45 కోట్లతో సోలార్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. మార్కెట్లు, కమ్యూనిటీ హాళ్లు, మున్సిపల్ దుకాణాల ద్వారా ఆదాయం పెంచుకోడానికి చూస్తున్నామన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ వెంకట రమణ, ఎస్ఈ పాండురంగారావు, సీపీ కోటయ్య, ఎంహెచ్ఓ డాక్టర్ వినూత్న, మేనేజర్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రీ రిలీజ్ ఈవెంట్‌పై దిశానిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న స్వామి నాయుడు



వేమగిరిలో సభాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గేమ్ చేంజర్ ప్రీరిలీజ్ ఈవెంట్‌లో హైదరాబాద్ తరహా సంఘటన జరగకుండా మెగా అభిమానులకు దిశానిర్దేశం చేశామని అఖిల భారత చిరంజీవి యువత అధ్యక్షుడు రవణం స్వామినాయుడు స్పష్టం చేశారు. స్థానిక సంహిత ఫంక్షన్ హాల్లో రాష్ట్ర చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి ఏడిద బాబీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం మెగా అభిమానుల ఆత్మీయ కలయిక పేరుతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రవణం స్వామినాయుడు..ఈవెంట్ నిర్వహణ ఏర్పాట్లపై అభిమానులతో చర్చించారు. పోలీసుల నిబంధనల మేరకు సుమారు లక్ష మందికి సిట్టింగ్ ఏర్పాటు చేశామని, అంతకుమించి వచ్చినా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం ఈవెంట్ విజయవంతం కోరుతూ రాజమహేంద్రవరంలో మెగా అభిమానులు బైక్ ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం మహిళలకు చీరలు పంపిణీ చేస్తామని, రామ్‌చరణ్ పాత్రధారణలో ఉండే వెయ్యి మందితో నగరంలో ప్రదర్శన నిర్వహిస్తామన్నారు.

ప్రీ రిలీజ్ ఈవెంట్ సభా స్థలం పరిశీలన

కడియం: వేమగిరిలో గేమ్ చేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగే సభా స్థలాన్ని గురువారంజిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో మాట్లాడుతూ ట్రాఫిక్ విషయంతో పాటు, పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఎవరికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పగడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరుకానున్నడంతో ఆయన సెక్యూరిటీ సంబంధించిన అంశాలపై పోలీసు అధికారులతో చర్చించారు. దక్షిణ మండల డీఎస్పీ భవ్య కిషోర్, కడియం ఇన్‌స్పెక్టర్ అల్లు వెంకటేశ్వరరావు తదితరులు ఆయన వెంట ఉన్నారు. అలాగే సభాస్థలిని అఖిల భారత చిరంజీవి యువత అధ్యక్షుడు రవణం స్వామినాయుడు పరిశీలించారు. కాగా.. రామ్‌చరణ్ నటించిన గేమ చేంజర్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ శనివారం వేమగిరిలో నిర్వహించనున్న విషయం తెలిసిందే.

యాజమాన్య కమిటీల సహకారం అవసరం



మాట్లాడుతున్న అర్బన్ రేంజ్ డీఐ దిలీప్ కుమార్

కంబాలచెరువు: పాఠశాల నిర్వహణ, అభివృద్ధికి యాజమాన్య కమిటీల సహకారం ఎంతో అవసరమని రాజమహేంద్రవరం అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ అన్నారు. అర్బన్ పరిధిలోని ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఆ పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌లకు గురువారం నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐ మాట్లాడుతూ యాజమాన్య కమిటీ విధులు బాధ్యతలు, యాజమాన్య కమిటీ సమావేశాల నిర్వహణ, పాఠశాల అభివృద్ధి ప్రణాళిక తయారీ, పాఠశాలలో సామాజిక తనిఖీ, పాఠశాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం, ప్రధానోపాధ్యాయులకు ఎదురయ్యే సమకాలీన సమస్యలు పరిష్కారాలపై జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్లు వివరిస్తారన్నారు. ఈ శిక్షణలో అంశాలను అవగాహన చేసుకుని, జనవరి ఆరో తేదీన యాజమాన్య కమిటీ సమావేశం నిర్వహించాలన్నారు. అక్కడ మిగిలిన సభ్యులకు శిక్షణ ఇవ్వాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.

మేయర్‌గా పోటీ చేస్తా

సీటీఆర్ఐ: రాబోయే నగరపాలక సంస్థ ఎన్నికల్లో మేయర్‌గా పోటీ చేస్తానని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ అన్నారు. తన పోటీకి కూటమిలోని పార్టీల నాయకుల ఆమోదం నూరు శాతం ఉంటుందన్నారు. మోరంపూడిలోని శుభమస్తు ఫంక్షన్ హాల్లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1983 నుంచి తెలుగుదేశం పార్టీకి తాను అందించిన సేవలు, ప్రజల కోసం చేసిన పోరాటాలు, తనపై నమోదైన కేసులు ఎన్నో ఉన్నాయన్నారు. తాను మేయర్‌గా పోటీ చేస్తానన్న దానిపై అవసరమైతే పబ్లిక్ సర్వే నిర్వహించి, దానిలో 90 శాతం తనకు అనుకూలంగా రాకపోతే తాను పూర్తిగా రాజకీయాలనుంచి తప్పుకుంటానని గన్ని కృష్ణ ప్రకటించారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు.

- ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కాతేరులోని దాసరి నగర్, పంచాయతీ ఏరియా, సుబ్బారావుపేట, దేవాంగుల వీధి, సీటీఆర్ఐ రోడ్, జీఎస్ఆర్ ఏరియా, నూకాలమ్మ గుడి ప్రాంతం, ముస్లిం పేట, అంబేడ్కర్ నగర్, ఆఫీషియల్ కాలనీ, పంచాయతీ ప్రాంతం, కాతేరు రోడ్, బ్రాహ్మణ అగ్రహారం, బూసమ్మ కాలనీ, శ్రీరామ్ నగర్, బీసీ కాలనీ, వీవీ కొండయ్య, కాతేరు గ్రామంలోని బ్రాహ్మణ అగ్రహారం, రెవెన్యూ కాలనీ, రాజీవ్ కాలనీ, తహసీల్దార్ కార్యాలయం, పాలిటెక్నిక్ కాలేజీ, గాయత్రీ నగర్, ఎంప్లాయీస్ కాలనీ, ఏఎంజీ కాలేజీ, రాజవోలులో సరఫరా ఉండదు.
- ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ రాజమహేంద్రవరంలోని ఎంజీ మార్కెట్, గారపాటి నగర్, శాంతిపురం, అల్యూమినియం కాలనీ, షెల్టన్ హోటల్ ఏరియా, బైపాస్ రోడ్డు, రెల్లిపేట, డీఎంహెచ్ స్కూల్ ఏరియా, మహాత్మా గాంధీ వస్త్ర మార్కెట్‌లో విద్యుత్ ఉండదు.

కడియం: మురమండ సబ్ స్టేషన్ పరిధిలోని మురమండ, దుళ్ల, మాధవరాయుడుపాలెం, దామిరెడ్డిపల్లి, వీరవరం, పొట్టిలంక ఫీడర్ల పరిధిలోని వ్యవసాయ బోర్లు, గృహాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ అంతరాయం కలుగుతుంది. ఈ విషయాన్ని ఏపీఈపీడీసీఎల్ (ఆపరేషన్స్) రాజమహేంద్రవరం రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ గురువారం ప్రకటనలో తెలిపారు. వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

బ్రహ్మోండ నాయకునికి ప్రణమిల్లిన భక్తజనం



బలభద్రపురంలో గోదాదేవి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తజనం

- అంగరంగ వైభవంగా చివరి రోజు గ్రామోత్సవం
- ముత్తయిదువులతో స్వామికి జలాభిషేకం
- నేత్రానందంగా గోదాదేవి కల్యాణం



చక్రస్నానంలో పాల్గొన్న భక్తులు



రథంపై ఊరేగుతున్న స్వామివారు

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలోని శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా చివరి రోజు గోదాదేవి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం సుప్రభాత సేవ, లఘు అర్చన, తోమాలసేవ నిర్వహించారు. అనంతరం 1,008 మంది ముత్తయిదువులతో స్వామివారికి గోదావరి జలాలతో అభిషేకం చేశారు. పంచామృతాభిషేకం చేసిన పిదప స్వామివారికి అలంకరణ చేశారు. చక్రస్నానంలో భారీ ఎత్తున భక్తులు పాల్గొన్నారు. గోదాదేవి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. కేరళ డప్పులు, సన్నాయి మేళాల మధ్య రథంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. పెద్ద ఎత్తున అన్న సమారాధన చేశారు. సుమారు 25 వేల మందికి పైగా భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి, కమిటీ సభ్యులు నల్లమిల్లి రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట ఘర్షణలో యువకుడికి రిమాండ్

సీతానగరం: రాజంపేటలో మంగళవారం రాత్రి జరిగిన ఘర్షణకు సంబంధించి కాటవరానికి చెందిన గాడ దుర్గాప్రసాద్‌కు కోర్టు రిమాండ్ విధించిందని కోరుకొండ సీఐ సత్య కిషోర్ తెలిపారు. అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారని, రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా అతడికి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుర్గాప్రసాద్‌పై రౌడీ షీట్ త్వరలో ఓపెన్ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సై డి.రామ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వేకు భూ రికార్డులు అందించాలి

సీతానగరం: మిర్తిపాడులో నిర్వహించే రీసర్వేకు రైతులు తమ భూమి రికార్డులను అందించాలని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ కోరారు. ఆయన ఆధ్వర్యంలో గురువారం ఆ గ్రామంలో సభ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు తమ దస్తావేజులు, లింక్ డాక్యుమెంట్లు, ఆధార్, బ్యాంక్, పట్టాదారు పాస్ పుస్తకాల జిరాక్సులను సంబంధిత అధికారులకు అందించాలన్నారు. మొదటిగా విలేజ్ బౌండరీలు సర్వే చేసి, విడగొట్టడం జరుగుతుందన్నారు. అనంతరం ప్రభుత్వ భూములను గుర్తిస్తామన్నారు. భూ సర్వేకు నాలుగు టీమ్‌లను ఏర్పాటు చేశామని, ఈ నెల 20 నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. వచ్చే నెలాఖరుకు ప్రభుత్వ భూములు గుర్తించడం పూర్తవుతుందని, అనంతరం ప్రైవేటు భూముల రీసర్వే జరుగుతుందన్నారు.

సరిహద్దుల నిర్ధారణతో ఎంతో మేలు



సమావేశంలో సూచనలు ఇస్తున్న ఈవోపీఆర్డీ ఆర్మ్‌స్ట్రాంగ్

రాజమహేంద్రవరం రూరల్: గ్రామకంఠం భూమి యాజమాన్య సరిహద్దుల నిజనిర్ధారణతో లబ్ధిదారులకు ఎంతో మేలు జరుగుతుందని ఈవోపీఆర్డీ ఆర్మ్‌స్ట్రాంగ్ అన్నారు. హుకుంపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో ఇన్‌చార్జి కార్యదర్శి జి.కాశీవిశ్వనాథ్ అధ్యక్షతన గురువారం స్వమిత్వ గ్రౌండ్ ట్రూతింగ్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఈవోపీఆర్‌అండ్‌ఆర్డీ ఆర్మ్‌స్ట్రాంగ్ ముఖ్య అతిథిగా పాల్గొని.. సర్వేయర్లు, సచివాలయ సెక్రటరీలకు పలు సూచనలు చేశారు. గ్రామాలలో ఉన్న గ్రామకంఠం భూముల యాజమాన్య సరిహద్దులు నిజనిర్ధారణ చేసి, లబ్ధిదారులకు శాశ్వత పట్టాలు ఇవ్వడం జరుగుతుందన్నారు.

అదుపులో ఐదుగురు

సీటీఆర్ఐ: రామదాసుపేటలో సారా తాగుతున్న ఐదుగురిని గురువారం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పట్టుకున్నారు. స్థానిక 46వ డివిజన్‌కు గురువారం ఆయన ఒక అధికారిక కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్లారు. సమీపంలో సారా తాగుతున్న ఐదుగురి పట్టుకున్నారు. స్థానికంగా సారా విక్రయిస్తున్న మహిళను మందలించారు. అనంతరం వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

బాలిక అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: పెన్నులను కొనేందుకు ఇంటి నుంచి వెళ్లిన తన కుమార్తె తిరిగి ఇంటికి రాలేదని లాలాచెరువు బత్తిన నగర్‌కు చెందిన టి.అరుణ గురువారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె 16 ఏళ్ల కుమార్తె గురువారం ఉదయం 6.30 గంటల సమయంలో పెన్నులు కొనుక్కుంటానని చెప్పి వెళ్లింది. అప్పటి నుంచి ఇప్పటివరకు తిరిగిరాలేదు. ఎస్సై ఆర్.అంకారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సినిమాలు



శ్యామల	: మ్యాక్స్
సూర్యమినీ	: ముఫాసా
సూర్యప్యాలెస్	: యుఐ, డ్రావెన్
స్వామి	: ముఫాసా
శివజ్యోతి	: పుష్ప-2
అనుశ్రీ	: మార్కో
రాజా	: పుష్ప-2
ఊర్వశి	: క్రావెన్
మేనక	: బేబీ జాన్
రంభ	: బచ్చలమల్లి
కుమారి	: ముఫాసా
అప్సర	: పుష్ప-2
అశోక	: మార్కో
నామవరం	
వీఎస్ మహల్	: పుష్ప-2 , క్రావెన్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: పుష్ప-2
కడియం	
వెంకటసూర్య	: పుష్ప-2, క్రావెన్